నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
5 | హైదరాబాద్, సోమవారం 8 జనవరి 2024 | SANGAREDDY

నిమ్జ్ భూ బాధితులకు న్యాయం చేయాలి

న్యాల్‌కల్, జనవరి 7: నిమ్జ్‌లో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని మండలంలోని పలు గ్రామాల రైతులు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ కోదండరాంను నిమ్జ్ రైతులు కలిసి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నిమ్జ్ కోసం సేకరిస్తున్న భూముల జాబితాల్లో తమ భూములు ఉండడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. భూములను ఇతరులకు అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో పాటు బ్యాంకుల్లో అప్పులు తీసుకునేందుకు అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ భూములకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన నిమ్జ్ భూ బాధితులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాంను కలిసి సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని కోరుతున్న నిమ్జ్ భూ బాధితులు

మౌలిక వసతుల కల్పనకు వినతి

హత్నూర, జనవరి 7 : మండలంలోని కొన్యాల ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని ఆదివారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. కొన్యాల మాజీ సర్పంచ్ సుజాత, కాంగ్రెస్ నాయకుడు సత్యం కలిసి వైద్య ఆరోగ్యకేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

జిన్నారం : రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేగూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం : ఆర్సీపురంలో సోమేశ్వరస్వామి జాతరలో పాల్గొన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- జంగంపేటలో రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

జిన్నారం, జనవరి 7 : పటాన్‌చెరు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జంగంపేట గ్రామంలో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణానికి తనవంతు సహకారం అందించినట్లు చెప్పారు. అనంతరం సర్పంచ్ వెంకటయ్య, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేశం గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, ఊట్ల సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సార నరేందర్, గాండ్ల శ్రీనివాస్, బండి శ్రీకాంత్‌గౌడ్, భిక్షపతి, మహేశ్ ఉన్నారు.

జాతరలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక

రామచంద్రాపురం, జనవరి 7 : జాతరలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహోత్సవంలో డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పా నగేశ్‌తో కలిసి హాజరయ్యారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లాపూర్ గ్రామంలో జరుగుతున్న భ్రమరాంబిక మల్లికార్జునస్వామి జాతరలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలను స్వామివారు సుఖసంతోషాలతో చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఆయా ఆలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, ప్రముఖులను సన్మానించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్, ఏఎంసీ చైర్మన్ మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఏఎంసీ డైరెక్టర్ ఐలేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేశ్‌యాదవ్, సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్, కౌన్సిలర్ శ్రీశైలం, మున్సిపాల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌యాదవ్, నర్సింహులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామికి ఎమ్మెల్యే పూజలు

హత్నూర, జనవరి 7 : హత్నూర శివారులోని మల్లన్నగుట్టల్లో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం షెడ్డు, రోడ్డు నిర్మాణం చేపట్టాలని కురుమ సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఆమె వెంట గ్రామస్తులు కిష్టయ్య, ఆశయ్య, మధుసూదన్‌గౌడ్, నరేందర్, చెన్నారెడ్డి, భిక్షపతి, నర్సింహులు, రాజు, సురేశ్, కృష్ణ, శ్రీశైలం ఉన్నారు.

మల్లికార్జునస్వామి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

17లోగా దరఖాస్తుల డాటా ఎంట్రీ పూర్తి చేయాలి

న్యాల్‌కల్, జనవరి 7: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల డాటా ఎంట్రీ ఈ నెల 17 వరకు పూర్తి చేయాలని జహీరాబాద్ డివిజన్ పంచాయతీ, మండల ప్రత్యేకాధికారి రాఘవరావు మండల అధికారులను ఆదేశించారు.

ఆదివారం న్యాల్‌కల్ ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో జరుగుతున్న దరఖాస్తుల డాటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 37పంచాయతీల్లో అర్హులైన వారి నుంచి ఆరు గ్యారెంటీలకు సంబంధించి 14,103 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. రేషన్ కార్డులతో పాటు ఇతరాత్ర వాటిని సంబంధించి 3,381 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు.

ఆపరేటర్లు డాటా ఎంట్రీలో దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ భానుకిరణ్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, మండల అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ అధికారి సురేశ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



న్యాల్‌కల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీ నమోదు పరిశీలిస్తున్న జహీరాబాద్ డీఎల్పీవో రాఘవరావు

జాతీయ సాహస శిబిరంలో తారా వలంటీర్ల సత్తా

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 7: కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సాహస శిబిరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన తెలంగాణ బృందంలో స్థానిక తారా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సత్తా చాటారు. ఈ బృందానికి తారా కళాశాలకు చెందిన అర్థశాస్త్ర అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీశ్వర్ కాంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించారు. 10 మంది వలంటీర్లు ఉన్న ఈ బృందంలో తమ కళాశాలకు చెందిన బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి రంజిత్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చడం కళాశాలకే గర్వకారణమని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో డిసెంబర్ 23 నుంచి ఈ నెల 1 వరకు జరిగిన జాతీయ సాహస శిబిరంలో రాష్ట్రం నుంచి 10 మంది విద్యార్థులు పాల్గొనగా, ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి తారా కళాశాల నుంచి రంజిత్‌రెడ్డి, సిద్దిపేట ప్రభుత్వ కళాశాలకు చెందిన ఆగస్టీన్ ఉన్నారని వివరించారు.

జాతీయ సాహస శిబిరంలో పాల్గొన్న తారా కళాశాల అధ్యాపకుడు డాక్టర్ జగదీశ్వర్, వలంటీరు రంజిత్‌రెడ్డి

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు

పుల్కల్, జనవరి 7: అయోధ్య రామమందిరంలో ఈ నెల 22న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకొని అక్షింతలను ఆదివారం పుల్కల్‌లో ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు.

హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి, అక్షింతలతోపాటు విగ్రహప్రతిష్ఠ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణ్ కుమార్, ఉపసర్పంచ్ నర్సింహులు, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మన్నె చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ మన్నె విఠల్, శ్రీనివాస్, రాజశేఖర్, విజయ్‌కుమార్, దామోదర్, నారాయణ, పవన్ పాల్గొన్నారు.

శ్రీరాముడి దేవాలయ అక్షింతల పంపిణీ

అమీన్‌పూర్, జనవరి 7: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు శ్రీహనుమాన్ దేవాలయం వద్ద శ్రీరాముడి ఆలయ అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల శోభాయాత్ర

జిన్నారం, జనవరి 7 : జిన్నారంలోని దర్గా కాలనీలో అయోధ్య రామాలయ అక్షింతల శోభాయాత్రను నిర్వహించారు. హిందూధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అక్షింతల శోభాయాత్ర నిర్వహించిన అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్మూర్తి, బుక్క శ్రీకాంత్, వినోద్, వెంకటస్వామి, వినోద్ పాల్గొన్నారు.

అమీన్‌పూర్ : అక్షింతలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

మునిపల్లి, జనవరి 7: అనుమతులు లేకుండా గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కంకోల్ శివారులోని ముంబయి జాతీయ రహదారి డెక్కన్ టోల్ ప్లాజా వద్ద ఆదివారం అసిస్టెంట్ కమిషనర్ రఘురామ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ట్రావెల్స్ బస్సులో ఉల్లాస్ శ్రీధర్, అబసాహెబ్‌రానే అనే ఇద్దరు డ్రైవర్లను అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నారని అదుపులోకి తీసుకున్నట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపారు. గోవా నుంచి తీసుకువస్తున్న 70మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

కంకోల్ టోల్‌గేట్ వద్ద స్వాధీనం చేసుకున్న గోవా మందు

నేటి నుంచి బాల వైజ్ఞానిక ప్రదర్శన

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 7: జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శిని ఈ నెల 8,9,10 తేదీల్లో నిర్వహించేందుకు స్థానిక సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ సన్నాహక సమావేశం విద్యాశాఖ అధికారులతో డీఈవో నిర్వహించారు. బాల వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణ కోసం 11 కమిటీలను ఏర్పాటు చేశారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ నెల 8న బాల వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లా నుంచి మొత్తం 900కు పైగా ఎగ్జిబిట్లు, 2500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శనలో పాల్గొననున్నట్లు వారు వెల్లడించారు. ప్రదర్శనను తిలకించేందుకు 10 వేల మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉన్నదని అంచనా వేశారు.

జాతీయస్థాయి పోటీకి కృష్ణాపూర్ పీఈటీ ఎంపిక

కల్హేర్, జనవరి 7: మండలంలోని కృష్ణాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ రాములు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలో పాల్గొని మంచి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్‌రావు తెలిపారు. పీఈటీ శనివారం హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో లాంగ్‌జంప్, 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు, 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకాలు సాధించినట్లు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. పీఈటీ రాములును ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ కిష్టారెడ్డితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

బంగారు పతకాన్ని అందుకుంటున్న పీఈటీ రాములు

చిన జీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే గూడెం

పటాన్‌చెరు, జనవరి 7 : ప్రముఖ ఆధ్యాత్మికవేత్త త్రిడండి చిన జీయర్‌స్వామిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆదివారం హైదరాబాద్ శివారులోని ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామిని ఎమ్మెల్యే, ఆయన సతీమణి గూడెం యాదమ్మ కలిశారు. మూడోసారి పటాన్‌చెరు ఎమ్మెల్యేగా గెలిచినందుకు ఎమ్మెల్యేను స్వామి అభినందించారు. నియోజకవర్గంలో 180కు పైగా దేవాలయాలు నిర్మించేందుకు అండగా నిలవడంపై ఆయన ఎమ్మెల్యేను కొనియాడారు. ఎమ్మెల్యే వెంట తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ లచ్చిరామ్‌నాయక్, దాసు, సంతోశ్ గౌడ్, సందీప్‌గౌడ్ ఉన్నారు.

చిన జీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు

కేకే భూమిలో అక్రమ నిర్మాణాలు

జిన్నారం, జనవరి 7 : మాదారం గ్రామంలో ఖారీజ్ ఖాతా(కేకే) భూముల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఆరు నెలలుగా నిర్మాణాలు కొనసాగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సర్వే నంబర్ 264, 265, 267లో ఆరెకరాల ఖారీజ్‌ఖాతా(కేకే) భూమి ఉంది. ఈ భూమిలో గతం లో పలు రకాల పంటలు సాగు చేశారు. ప్రస్తుతం ఒక పక్క అక్కడక్కడ మామిడి చెట్లు ఉండగా, మరోపక్క రోడ్డు వైపు కమర్షియల్ నిర్మాణాలు జరుగుతున్నాయి. గ్రామంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే నాలుగు సార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై ఆర్ ఐ జయప్రకాశ్ నారాయణను వివరణ కోరాగా, ఖారీజ్‌ఖాతా భూములు పూర్తిగా ప్రభుత్వానికి సంబంధించినవేనని, ఈ భూముల్లో నిర్మాణాలు చేయకూడదన్నారు. ఈ విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదన్నారు. విచారణ జరిపి నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

మాదారం గ్రామంలోని కేకే భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు

కొనసాగుతున్న సప్తాహ

నాగల్‌గిద్ద, జనవరి 7 : మండలంలోని కరస్‌గుత్తి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా సప్తాహ కార్యక్రమం కొనసాగుతున్నది. ఇందులో భాగంగా సోమవారం ఆలయ శిఖర మహోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రమేశ్, సునీల్‌పాటిల్ తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా నగర సంకీర్తన

సదాశివపేట, జనవరి 7: రామ మందిరం తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. మాణిక్ ప్రభు మందిరం నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన దేవర దాసమయ్య మందిరం, భవానీ మందిరం మీదుగా హనుమాన్ చాలీసా పారాయణం చేసి శ్రీరామ కళా మందిర్‌కు చేరుకున్నది. కార్యక్రమంలో శ్రీరామ తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

కోహీర్, జనవరి7 : మండలంలోని మనియార్‌పల్లి, గొటిగార్‌పల్లి గ్రామాల్లో ఆదివారం మల్లికార్జునస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి చేశారు. ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మల్లికార్జునస్వామి, బీరప్పకు బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనుసూజమ్మ, భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సదాశివపేట, జనవరి 7: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. ఆదివారం మండలంలోని కొనాపూర్‌లో పట్లోళ్ల శివనాగప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరకదారుఢ్యం పెరుగుతుందన్నారు. యువత నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడలు ఎంతో ఉపయోగడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభారాణీ సంగమేశ్వర్, బీఆర్ఎస్ నాయకుడు చింతా సాయినాథ్, పట్లోళ్ల చంద్రశేఖర్, మనోహర్, పట్లోళ్ల నందీశ్వర్ పాల్గొన్నారు.

జిన్నారంలో చిరుత సంచారం

జిన్నారం, జనవరి 7: జిన్నారం శివారులోని కొత్తచెరువు గండిలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో గుమ్మడిదల డీసీసీబీ బ్యాంకు మేనేజర్ ప్రద్యుమ్నారెడ్డి బొంతపల్లి నుంచి జిన్నారం వైపు వస్తుండగా రోడ్డుపై సంచరిస్తున్న చిరుతను గుర్తించారు. కొత్త చెరువు గండిలో చిరుత సంచరించినట్లు సోషల్ మీడియాలో వ్యాప్తికావడంతో ప్రజాప్రతినిధులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరాల ద్వారా చిరుత సంచారాన్ని తెలుసుకుంటామని అధికారులు తెలిపారు.

డిస్కౌంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పుల్కల్, జనవరి 7: ప్రభుత్వం వాహనదారులకు ఇచ్చిన ట్రాఫిక్ చలాన్ డిస్కౌంట్‌ను పుల్కల్, చౌటకూర్ మండలంలోని వాహనదారులు సద్వినియోగం చేసుకొని పోలీసులకు సహకరించాలని ఎస్సై క్రాంతి కుమార్ అన్నారు. ఈ అవకాశం మరో ఐదు రోజుల గడువు ఉందని తెలిపారు.

చర్చి నిర్మాణంలో అపశృతి

- బర్మాకు చెందిన కార్మికుడు మృతి
- 10 మందికి గాయాలు

కోహీర్, జనవరి7: చర్చి స్లాబ్ నిర్మాణ ప్రమాదంలో ఓ కార్మికుడి మృతి చెందిన ఘటన పట్టణంలో ఆదివారం జరిగింది. ఎస్సై విఠల్, స్థానికుల వివరాల ప్రకారం... కోహీర్‌లోని మెథడిస్ట్ చర్చి స్లాబ్ నిర్మా ణ ప్రమాదంలో బర్మాకు చెందిన ఖాసిముల్లా (19) మృతి చెందాడు. జార్కండ్, ఉత్తరప్రదేశ్, హైదరాబాద్‌కు చెందిన కొంతమంది కార్మికులు స్లాబ్ పనుల్లో నిమగ్నమయ్యారు. యంత్రం సహాయంతో పైకప్పు వేస్తున్న సమయంలో నిర్మాణంలో ఉన్న స్లాబ్ అకస్మాత్తుగా కూలింది. దీంతో ఖాసిముల్లాషేక్, రాజు, అబ్దుల్లా రహీమ్, దలీమ్, తుర్‌జవూల్ షేక్, ఓంప్రకాశ్, షేక్ ఆదిల్, మోహన్‌సింగ్, కృష్ణ, అమర్‌కు గాయాలయ్యాయి. ఇనుప చువ్వ లు, కట్టెలు వారిపై పడడంతో గాయపడ్డారు. ఖాసిముల్లా షేక్, రాజుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం సంగారెడ్డి జిల్లా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బర్మాకు చెందిన ఖాసిముల్లా షేక్ మృతిచెందాడు. హైదరాబాద్‌కు చెందిన రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మిగతా వారికి కోహీర్ దవాఖాన లో చికిత్స అందిస్తున్నారు. జహీరాబాద్ డీఎస్పీ రఘు, సీఐ రాజు, ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. పనుల్లో నిర్లక్ష్యం చేసిన కాంట్రాక్టరును అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విఠల్ వెల్లడించారు.



కోహీర్ దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

క్షతగాత్రులకు వైద్యం అందించాలి : ఎమ్మెల్యే

కోహీర్, జనవరి 7 : కోహీర్‌లోని మెథడిస్ చర్చి స్లాబ్ నిర్మాణంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కోరారు. ఆదివారం మెథడిస్ట్ చర్చి స్లాబ్ నిర్మాణ ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఘటనా స్థలాన్ని సందర్శించారు. కాంట్రాక్టర్, స్థానికులతో మాట్లాడారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వహీద్, కలీం, సందీప్, సునీల్, నిరంజన్ ఉన్నారు.

ప్రమాదం గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు